www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 9 డిసెంబర్ 2024
5
వైఎస్ఆర్

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత రాక

ప్రజాశక్తి - కడప

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత ఈనెల 9న జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు ప్రొద్దుటూరు మండలం దొరసాని పల్లెకు చేరుకుని మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులో పాల్గొంటారన్నారు. అనంతరం మంత్రి అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:45 గంటలకు కమలాపురం మండలం చిన్నచెప్పలికి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులో సదస్సులో మంత్రి పాల్గొంటారని తెలిపారు. రాత్రి 9:40 గంటలకు జమ్మలమడుగు రైల్వే స్టేషన్ చేరుకుని అక్కడినుంచి రైలులో విజయవాడకు బయలుదేరి వెళ్తారు.

విద్యుత్ ఛార్జీల మోత

చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లి చెందిన ఓ.శ్రీనివాస్ కడప-రాయచోటి జాతీయ రహదారి సమీపంలో నివాసం ఉంటున్నారు. ఇతను వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. డిసెంబర్ నెలలో రూ.660 అదనపు బిల్లు రావడంతో షాక్ గురయ్యారు. ఇదేతరహాలో బోడెద్దులపల్లికి చెందిన షేక్ రహమత్ బీ అనే మహిళ ఇంటికి నెలకు రూ.100 అదనపు బిల్లు రావడంతో గుండె గుభిల్లు మంది. ఇదేతరహాలో చిల్లర దుకాణదారుల బిల్లులను పరిశీలిస్తే వేలాది రూపాయలు పెరిగిన దాఖలాలు కొల్లలుగా ఉన్నాయి. టిడిపి అధికారంలోకి వస్తే కరెంటు బిల్లులను పెంచబోమని, అవసరమైతే తగ్గించేలా చర్యలు తీసుకుంటామని టిడిపి అధ్యక్ష హోదాలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని ఆర్నెల్లలోనే సర్దుబాటు ఛార్జీల పేరుతో ఉల్లంఘించడం విస్మయాన్ని కలిగిస్తోంది.

- ట్రూఅప్, సర్దుబాటు పేరుతో బాదుడు
- డిసెంబర్ నెలలో ఒకరికి రూ.660 పెంపు
- వైసిపి బాటలోనే కూటమి సర్కార్
- డిసెంబర్‌లో రూ.61పైసలు పెంపు
- జనవరి నుంచి మరో బాదుడు
- వినియోగదారులు లబోదిబో

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

విద్యుత్ బిల్లుల పెంపుతో కూటమి సర్కారు షాక్‌లిస్తోంది. ట్రూఅప్, సర్దుబాటు పేరుతో సామాన్యులపై భారం మోపుతోంది. ఈనెల 2 నుంచి విద్యుత్‌శాఖ బిల్లులు పంపిణీ చేస్తోంది. విద్యుత్ బిల్లుల బాదుడును చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. 2024 డిసెంబర్‌లో కనిష్టంగా రూ.140 నుంచి గరిష్టంగా రూ. 660 వరకు బాదుడు ఆందోళన కలిగిస్తోంది. వైసిపి సర్కారు తరహాలోనే కూటమి సర్కారు కరెంటు ఛార్జీలు పెంచబోమనే హామీని ఉల్లంఘించి జనాన్ని బాదుతోంది. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి బాదుతోంది. 2025 జనవరి నుంచి మరో రకం పెంపుదలకు కసరత్తు చేస్తోంది.

జిల్లాలో 11.19 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో 8.19 లక్షల గృహాల కనెక్షన్లు, 91 వేల వాణిజ్య కనెక్షన్లు, 4, 195 పరిశ్రమల కనెక్షన్లు, 27,600 ప్రభుత్వ కార్యాలయాలు, 1. 76 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో హెచ్‌విడిఎస్ 26 7 సబ్‌స్టేషన్ల పరిధిలో ఆరు కేటగిరీలుగా విద్యుత్ కనెక్షన్లను విభజించారు. వీటిపరిధిలోని కనెక్షన్లకిక్కి (ట్రూఅప్, సర్దుబాటు, ఫిక్స్ డ్, కస్టమర్, ఇడి, ఎనర్జీ, ఎఫ్ పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ-2 ఛార్జీల పెంపు పేరుతో బాదుతోంది. కడప నగరంలోని మధ్యతరగతి కుటుంబం డిసెంబర్‌లో 91 యూనిట్లకు రూ.264 బిల్లు చెల్లించాల్సి ఉండగా ఇతర అదనపు ఛార్జీలతో కలిపి రూ. 484 రెట్టింపు బిల్లు రావడం ఆందోళన కలిగించింది. ఇందులో నవంబర్‌లో నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లికి చెందిన ఓ కుటుంబం నెలకు రూ.2,214 బిల్లు చెల్లించాల్సి రావడం విస్మయాన్ని కలిగించింది. ఇందులో అదనపు ఛార్జీల కింద రూ.660 రావడం ఆందోళన కలిగించింది. ఇందులో నాలుగో వంతుపైగా అదనపు ఛార్జీల కింద బిల్లు రావడం విస్మయాన్ని కలిగించింది. వినియోగానికి, విద్యుత్ బిల్లుకు ఇంతటి వ్యత్యాసాన్ని చూపించడంపై విస్తుపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుందని, వేసవి సీజన్‌లో వినియోగం పెరగనున్న నేపథ్యంలో ఇంకెంత మొత్తంలో బిల్లు వస్తుందోననే ఆందోళన కనిపిస్తోంది. చిరు వ్యాపారుల పరిస్థితిని గమనిస్తే నెలకు రూ.రెండు వేల అదనపు ఛార్జీల రూపంలో బిల్లు వస్తోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇంతటి స్థాయిలో విద్యుత్‌భారాల్ని మోపుతున్న కూటమి సర్కారు తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ, అధికారంలోకి వచ్చినప్పటితో పోలిస్తే భిన్నంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

సామాన్య ప్రజల జీవితాలతో కూటమి సర్కారు చెడుగుడు ఆడుతోంది. ఒకవైపు నిత్యావసరాలు, కూరగాయల ధరలు పెరుగు తుండగా, మరోవైపు విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతుండడం ఆందోళన కలిగిస్తోంది.కందిపప్పు, మినప పప్పు ధరలు రూ.180 దాటుతోంది. వంటనూనెల ధర కిలో రూ.140 నుంచి రూ.180 వరకు, ఉల్లి రూ.50, వెల్లుల్లి రూ. 400, ఇతర కూరగాయల ధరలు రూ.40 నుంచి రూ.60 వరకు పెరిగిన పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సామాన్య ప్రజానీకం విలవిలలాడుతోంది. వైసిపి సర్కారు తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని కూటమి సర్కారు ఎన్నికల ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. కూటమి అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోపే విద్యుత్ ఛార్జీలను పెంచడం విస్మయాన్ని కలిగిస్తోంది.

అదనపు ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

గత నెలతో పోలిస్తే రూ.660 అదనపుబిల్లు రావడం ఆందోళన కలిగించింది. ఇంతటి స్థాయిలో బిల్లు పెరగడం ఎన్నడూ చూడలేదు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు పోటాపోటీగా పెరుగుతుండగా అమాంతంగా కరెంటు బిల్లులు పెరగడం ఆందోళన కలిగించింది.

- ఓ.శ్రీనివాస్, జి.నారాయణపురం, చింతకొమ్మదిన్నె మండలం,కడప.

రెట్టింపు బిల్లు ఆందోళనకరం

గత నెల విద్యుత్ బిల్లు కంటే రూ.224 ఎక్కువగా వచ్చింది. ఒక్కసారిగా ఇంతటిస్థాయిలో పెంచడం సామాన్య కుటుంబాలు చెల్లించలేని పరిస్థితి. ఉన్నపళంగా పెంచిన కరెంటు బిల్లులతో సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడుతోంది.

-బి.రాజేశ్వరి, గృహిణి, కడప.

విద్యుత్ భారాల్ని తగ్గించాలి

విద్యుత్ ఛార్జీల భారాల్ని తగ్గించాలి.డిసెంబర్‌లో పెరిగిన బిల్లు చేసేట్లుగా రూ.1086 వచ్చింది. ఒక్కసారిగా ఇంతటిస్థాయిలో బిల్లు వస్తే భరించడం కష్టంగా ఉంది.

-ఎస్. రహమ్మతుల్లా,బోడెద్దులపల్లి, చింతకొమ్మదిన్నె మండలం,కడప.

ట్రూఅప్ ఛార్జీలను ఉపసంహరించాలి

కూటమి సర్కారు ట్రూఅప్‌ఛార్జీలను ఉపసంహరించుకోవాలి. సామాన్యులపై ఇంతటిస్థాయిలో భారాలను మోపడం సరికాదు. ట్రూఅప్, సర్దుబాటు, ఎఫ్‌పిపిసిఎ సహా పలు పేర్లతో భారీ వసూళ్లకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

-మనోహర్,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి,కడప.

ఎంపీ పిఎ రాఘవరెడ్డికి నోటీసులు జారీ

- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశాలు

రాఘవరెడ్డికి నోటీసులు అందిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

సోషియల్ మీడియాలో అసభ్యకర పోస్టింగ్‌ల కేసులో ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి ఎపి బండి రాఘవరెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 9న విచారణకు కావాలని డిఎస్‌పి మురళీనాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం సాయంత్రం పోలీసులు రాఘవరెడ్డి ఇంటికి వెళ్లి 41-ఎ నోటీసులు అందజేశారు. నోటీసులలో సోమవారం ఉదయం 10 గంటలకు కడప క్రైమ్ బ్రాంచ్ కార్యాలయానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉదయం నుంచి కొనసాగిన హైడ్రామా

ఉదయం నుంచి రాఘవరెడ్డి వర్సెస్ పోలీస్‌లు అన్న రీతిలో హైడ్రామా కొనసాగింది. బండి రాఘవ రెడ్డి ఇంట్లో ఉన్నరనే సమారం అందుకున్న అర్బన్‌ఎస్‌ఐ విష్ణు నారాయణ, ఐడి పార్టీ పోలీసులు పట్టణంలోని ఆయన ఇంటికి వెళ్లారు. విచారణకు హాజరు కావాలి అని కోరగా 41-ఎ నోటీసులు ఇస్తేనే విచారణకు హాజరు అవుతాను రాఘవరెడ్డి చెప్పారు. గౌరవ హైకోర్టు ఈ నెల 13 వరకు పోలీస్ శాఖ అరెస్ట్ చేయకూడదు అని ఉత్తర్వులు జారీ చేసిందని, కావున విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇస్తేనే హాజరవుతానని పేర్కొన్నారు. దీంతో పోలీసులు చేసేదేమి లేక వెనుదిరిగి వెళ్లిపోయారు. విషయాన్ని ఉన్నత అధికారులకు తెలిపారు.

అజ్ఞాతం వీడిన రాఘవ రెడ్డి

సామాజిక మాధ్యమాలలో అసభ్యకర పోస్టులకు సంబంధించి నవంబర్ 8న పులివెందుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముద్దాయి అయిన వర్రా రవీంద్ర రెడ్డిని అరెస్ట్ చేసి విచారించారు. విచారణలో వర్రా ఇచ్చిన వాంగ్మూలంలో ఎంపీ పిఎ రాఘవరెడ్డి సూచనలతోనే పోస్ట్ పెట్టేవాడిని అని చెప్పడంతో ఆయన పేరును కేసులో నమోదు చేశారు. పోలీసులు తనను అరెస్టు చేస్తారని ముందుగా సమాచారం తెలుసుకుని గత నెల 10 నుంచి రాఘవ రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లారు. పోలీస్ శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి జల్లెడ పట్టి వెతికినా అదుపులోకి తీసుకోలేక పోయారు. రాఘవ రెడ్డి ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కడప కోర్టులో పిటిషన్ వేయగా కోర్టు తిరస్కరించడంతో హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈనెల 13 వరకు పోలీసులు రాఘవరెడ్డిపై ఎటువంటి చర్యలు తీసుకోరాదని అని మధ్యంతర ఉత్తర్వు లలు జారీ చేయడంతో దాదాపు నెల రోజుల పాటు అజ్ఞాతంలో ఉన్న రాఘవ రెడ్డి మొదటి సారి ఆదివారం పులివెందులలోని తన ఇంటికి రాడంతో అతన్ని కలిసేందుకు వైసిపి నాయకులు, కార్యకర్తలు భారీగా వచ్చారు.

అంగన్వాడీలకు పెండింగ్ వేతనాన్ని చెలించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు వెంటనే పెండింగ్ జీతాలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లాలో అధ్యక్షులు మనోహర్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీదేవి, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కోశాధికారి అంజలి దేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న పాలకులు ఒకటో తారీకు ఎన్ని కష్టాలు ఉన్నా వేతనాలు వేస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నేడు మర్చి పోయారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ చిన్న స్థాయి ఉద్యోగులని, జీతం మీదనే ఆధారపడి వారి కుటుంబాలు, పిల్లల చదువులు కొనసాగుతు న్నాయని అలాంటి పరిస్థితిలో వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. తక్షణమే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని తెలిపారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీల కార్యకర్తలతో ఆందోళన చేస్తామని చెప్పారు.

రాజోలి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

రాజోలి రిజర్వాయర్‌కు నిధుల కేటాయించి వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. మైదుకూరు స్థానిక బాలశివయోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైదుకూరు నియోజవర్గంలోని మూడు మండలాలకు సాగు, తాగు నీరు అందించే రాజోలు రిజర్వాయ నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైందని వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. గూండ్రేవుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ త్వరితగతిన పూర్తి చేసి కెసి.కెనాల్ నీటి స్థిరీకరణ పెంచాలని డిమాండ్ చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షమంది యువతి, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే వరకు పోరాడాలన్నారు. కృష్ణానదిపై సిద్దేశ్వరం అలుగు నిర్మించి గ్రావిటీ ద్వారా తీవ్ర కరువు పీడిత రాయలసీమ జిల్లాలలోని మెట్ట ప్రాంతాలకు ప్రతి ఏడాది సముద్రంలో కలుస్తున్న 135 టిఎంసిల నీటిని మళ్లించాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సంపూర్ణ మెజార్టీతో ఎన్నికైన నారా చంద్రబాబు నాయుడు రాయలసీమ వాసి అయినప్పటికీ రాయలసీమ అభివృద్ధిని, వెనుకబాటుతనాన్ని, కరువును విస్మరించి అభివృద్ధి అంతా అమరావతి కేంద్రంగా చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని వారు కోరారు. కడప - బెంగళూరు రైల్వేలైను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రాజెక్టు అని రెండు ప్రభుత్వాలు చెరో 50 శాతం నిధులు మంజూరు చేసి వెంటనే పూర్తి చేయాలని లేకుంటే ఇప్పటికే ఖర్చుపెట్టిన ప్రజాధనం పూర్తిగా నీటి పాలవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే నిర్మించిన రైలు పట్టాలను దొంగలు తరలిస్తున్నారని వారు హెచ్చరించారు.

ఉన్మాదిపై కఠిన చర్యలు తీసుకోండి

- ఫోన్‌లో ఎస్‌పికి ఇన్‌ఛార్జి మంత్రి సవిత ఆదేశం

ప్రజాశక్తి-కడప

వైఎస్ఆర్ జిల్లా వేముల మండలం కొత్తపల్లి యువతిపై ఉన్మాది కత్తితో దాడి చేసిన ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎస్‌పి విద్యాసాగర్‌తో మంత్రి సవిత మాట్లాడారు. తక్షణమే నిందితుడిని అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యమందించాలని తిరుపతి సిమ్స్ వైద్యులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. వేముల మండలం కొత్తపల్లిలో యువతిని కుళాయప్ప అనే ప్రేమోన్మాది అతి కిరాతకంగా కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలో యువతికి 11 చోట్ల కత్తిపోట్లు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దాడి చేసిన విషయం తెలిసిన వెంటనే ఇన్‌ఛార్జి మంత్రి ఎస్‌పి ఫోన్‌లో మాట్లాడి పరారీలో ఉన్న నిందితుడిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. నిందితుడు ఎంతటివాడైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదని మంత్రి సవిత స్పష్టం చేశారు.

కడప 'ఉక్కు'పై రాజకీయ పార్టీల వైఖరి తెలపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : కడప ఉక్కుపై రాజకీయ పార్టీల స్పష్టమైన వైఖరి తెలపాలని, ప్రజా ఉద్యమాలకు కలసి రావాలని అవసరమైతే పార్లమెంటు సమావేశాలలో ఎపి ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి చేసి అవసరమైతే పోరాటాలు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఆదివారం పట్టణంలోని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె మస్తాన్ షరీఫ్, ఎస్.కె ఆదిల్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ కడప ఉక్కు పైన కేంద్రం వైఖరి మారాలని అన్నారు. పార్లమెంటులో ఆ ప్రస్తావనే తమ వద్ద లేదని తెలపడం జిల్లా ప్రజలను కలిచివేసిందన్నారు. కడప ఉక్కు విభజన చట్టంలో చట్టబద్ధంగా రాసుకున్న వాటి అమలుకు కేంద్రం ముందుకు అడుగులు పడటం లేదన్నారు. వలసలు, కరువుతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంతంలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అయితే లక్షలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి కడప ఉక్కు పైన పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. పార్లమెంటులో రాష్ట్రంలోని అధికార,ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నోరెత్తక పోవడం భాదాకరమన్నారు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్షాల ఎంపీలు కడప ఉక్కు పైన తమ వైఖరి ప్రజలకు తెలపాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం డివైఎఫ్ఐ యువజన సంఘం భవిష్యత్‌లో పెద్ద ఎత్తున అన్ని రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను, మేధావులను విద్యార్థి, యువకులను కలుపుకొని పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

దేశ భవిష్యత్తు విద్యార్థులతోనే సాధ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రదర్శనను పరిశీలిస్తున్న సలావుద్దీన్

దేశ భవిష్యత్తు విద్యార్థులతోనే సాధ్యమని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. నగరంలోని నకాష్‌లో దుబాయ్ జీనియస్ స్కూల్లో 4వ సంవత్సరం నిర్వహించిన సైన్స్‌ఫేర్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థిని, విద్యార్థుల ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్‌లో విద్యారంగం, వైద్య రంగాల సంబ ంధించి విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంటుందని పేర్కొ న్నారు. విద్యార్థులు ఇలాంటి సైన్స్ ఫెయిర్ ల ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు వెళ్తారని పేర్కొన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దేశం ముందుకు సాగా లంటే ఇలాంటి సైన్స్ ఫెయిర్ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మహమ్మద్ అలీ బొగ్దాది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న ఎస్‌సి బాలుర హాస్టల్‌ను ఆదివారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ అధ్యర్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి వారి బృందం సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరం లోని హాస్టల్‌లో 250 విద్యార్థులకు మెనూ పాటించకుండా వార్డెన్ సుభాష్ అవినీ తికి పాల్పడుతున్నారన్నారు. వసతి గృహంలోని ఆవరణంలో కానీ లోపల ఉన్నటువంటి గదులలో మౌలిక సదుపాయాలు లేవన్నారు. అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రం చేయిం చకపోవడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని వార్డెన్‌ను వివరణ కోరగా 'మాకు ఇక్కడ ఇంతే.. ఎంతో మంది అధికారులకు తెలుసు, చూసి వెళ్ళిపోయారు మెనూ మా ఇష్ట ప్రకారమే నడుస్తుంది' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం బాధ్యత రాహిత్యమన్నారు. హాస్టల్ లోపల ఉన్న చెత్తా,చెదారం పరిశుభ్రంగా ఉంచకపోవడం వల్ల విద్యార్థులు డెంగీ, మలేరియా వంటి వ్యాధుల బారిన విద్యార్థులు బాధపడుతున్నారని పేర్కొన్నారు. అనేక వ్యాధులతో అనారోగ్యానికి గురి అయ్యి, చదువుకు దూరమవుతూ ఇంటికి వెళ్లిపోతున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు మెనూ సక్రమంగా పెట్టకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆవేదన వెలిబు చ్చారని తెలిపారు. ఇప్పటి కైనా దీనిపై జిల్లా ఉన్నత అధికారులు స్పందించి విచారణ చేసి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు మోహన్, వంశీ, నిత్య, సుమంత్ పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. పాత స్నేహితులందరూ మళ్లీ ఒకసారి కలుసుకోవడం చాలా ఆనందదాయకంగా ఉందని వారు పేర్కొన్నారు. ఇలాంటి అరుదైన అవకాశాన్ని కల్పించిన అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల అధినేత చొప్ప గంగిరెడ్డి, ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువును నేర్పించి, కర్తవ్య దీక్షను తమలో మేల్కొపి, సత్ఫలితాలలో సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరిగేలా చేసిందన్నారు, ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల స్థాపించి దాదాపు 14 సంవత్సరాల పూర్తయినందున పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి తమ విద్యార్థులను ఇలా సమావేశం కావడం తమకెంతో ఆనందఃదాయకం అన్నారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి కృషి చేసిన డాక్టర్ నాగేశ్వరరెడ్డిని, విద్యార్థులు, అధ్యాపకులు, ఆధ్యాత్మికత సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వంపై బురదజల్లడం మానుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీపై బురద జల్లే కార్యక్రమం వైసిపి ప్రభుత్వం చేస్తుందని తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా చేయలేని పని ఐదు నెలలలో తెలుగుదేశం పార్టీ చేస్తుంటే చూసి తట్టుకోలేక బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి చేసిన అన్యాయాలు, అక్రమాలు చూసిన ప్రజలు 11 స్థానాలు ఇచ్చి కూర్చోబెట్టినా వారికి ఇంకా అర్థం కావడం లేదని అన్నారు. రాష్ట్రంలో జరిగినటువంటి పేరెంట్స్ మీటింగ్ పండుగ వాతావరణం తలపించిందన్నారు.

సామాజిక పింఛను తనిఖీ సచివాలయాలు షురూ

- కడపలో లక్ష్మీపేట,అన్నమయ్యలో ఈటెమాపురం ఎంపిక

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సామాజిక పింఛను తనిఖీ సచివాలయాలను ఎంపిక చేసింది. కడప జిల్లాలోని చాపాడు మండలం లక్ష్మీపేట, అన్నమయ్య జిల్లాలోని పెనగలూరు మండలంలోని ఉటెమాపురం సచివాలయాలను తనిఖీ చేయాలని నిర్ణయించింది. లక్ష్మీపేట సచివాలయంలోని 400, ఈటెమాపురం సచివాలయంలో 431 సామాజిక పింఛన్లను తనిఖీ చేయనున్నారు. ఇందులోని నకిలీ పింఛన్లను ఏరివేయడానికి పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీ చేపట్టనున్నారు. కడప జిల్లాలో మూడు వేల మందికి పైగా నోటీసులను జారీ చేసింది ఇప్పటికే కొంతమంది పింఛన్లను పరిశీలన చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో సామాజిక పింఛన్ల తనిఖీ ప్రక్రియ వేగవంతం కానుందని చెప్పవచ్చు.

మల్బరీ సాగు లాభదాయకం

ఎకరాకు రూ.2 లక్షల ఆదాయం
కడప జిల్లా పట్టు పరిశ్రమశాఖ ఏడీ శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మల్బరీ సాగు లాభదాయకం. కుటీర పరిశ్రమ తరహాలో సాగు చేస్తే మంచి ఆదాయం లభిస్తుంది. సమర్థ యాజమాన్య పద్ధతులను జోడించాలి. దీనికితోడు ఇటీవలి నూతన రకపు వంగడాలతో పంటలను సాగు చేసుకోవాలి. ఆధునిక మార్కెటింగ్ సదుపాయం కారణంగా గణనీయంగా ఆదాయం లభిస్తోంది. సరుకును తూకం వేసిన వెంటనే పేమెంట్ చెల్లింపుల వ్యవస్థ ఏర్పాటైంది. స్వల్ప కాలిక పంటల తరహాలో 45 రోజు నుంచి 70 రోజుల వ్యవధిలో ఆదాయం వస్తుంది. తెగుళ్ల సోకే అవకాశం ఉండదు. వాణిజ్య పంటల తర హాలో లక్షలాది రూపాయల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయే అవకాశం ఉండదని పేర్కొంటున్న కడప పట్టు పరిశ్రమలశాఖ ఎడి శ్రీనివాసులరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

ముఖా ముఖి..

మల్బరీ వివరాలు తెలపండి ?

జిల్లాలో 425 ఎకరాల్లో మల్బరీ సాగులో చేయాల్సి ఉంది. 2024- 25 ఆర్థిక సంవత్సర ఆగస్టు నాటికి 135 ఎకరాల లక్ష్యానికిగానూ 90 ఎకరాల్లో సాగు చేయడమైంది. దీంతో 66.66 శాతం లక్ష్యాన్ని సాధించాం. జిల్లావ్యాప్తంగా 350 మంది రైతులకు రూ.269 కోట్ల మేరకు ఆదాయం వచ్చింది.

మల్బరీ ఫామ్‌లెన్ని?

రెండు మల్బరీ ఫామ్స్ ఉన్నాయి. మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంట, కడప నగర సమీపంలోని ఊటుకూరు ప్రాంతాల్లో పెంచుతున్నాం. రెండు లక్షల మల్బరీ నారు మొక్కలను పెంచి రైతులకు సరస మైన ధరలకు అందుబాటులో ఉంచుతున్నాం. రూ.2 చొప్పున నర్సరీ మొక్కలను అందజేస్తాం.

మల్బరీ విస్తరణ చర్యలేమిటి?

ఊటుకూరు, వనిపెంట ప్రాంతాల్లో మల్బరీ సాగు పట్ల అవగా హనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ సబ్సిడీలు, సాగు లాభదాయకతను వివరిస్తున్నాం. దీంతోపాటు వనిపెంటలో జాకీ పురుగుల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా అభ్యుదయ రైతులను ఆకర్షిస్తున్నాం. ఫలితంగా మల్బరీ సాగు విస్తీర్ణాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాం.

ప్రోత్సాహకాల వివరాలు తెలపండి?

ఎకరా నారు మొక్కలకు రూ.30 వేల యూనిట్, షెడ్డు నిర్మాణానికి రూ.3.35 లక్షలు, ఎస్‌సి, ఎస్‌టిలకు నాలుగు లక్షలు కేటాయిస్తున్నాం. పరికరాలు, స్టాండు, ప్లాస్టిక్ తట్టలు, నేత్రికములు (చంద్రికలు) నిమిత్తం రూ.75, 000 మంజూరవుతుంది. ఇందులో ఎస్‌సి, ఎస్‌టిలకు 90 శాతం, ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ అందజేస్తాం.

గూళ్ల రకాలెన్ని, ఇన్‌సెంటివ్స్ వివరాలు?

బైఓల్టేన్, సి.పి రకాలు. తెల్లగూళ్లు, ఏప్రిల్, మే, జూన్‌లో సాగు చేసుకోవచ్చు. సిపి గూళ్లు. తెల్లగూళ్లకు మార్కెట్లో కిలో రూ.750, సిపి గూళ్లకు రూ.400 ఇన్‌సెంటివ్ కింద ఇచ్చే అవకాశం ఉంది. రైతులే గూళ్లను మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవాలి. గూళ్ల కొనుగోలు అనం తరం నగదును చెక్కుల రూపంలో అందజేస్తారు.

మార్కెట్ల వివరాలు తెలపండి?

ఎదనపల్లి, కుప్పం, కదిరి, ధర్మవరం, పలమనేరు, హిందూపురం మార్కె ట్లలో విక్రయించుకునే అవకాశం ఉంది. కర్నాటకలో రాంనగర్, సిద్దల గట్ట మార్కెట్లు అందు బాటులో ఉన్నాయి.

సాగు సీజన్ల గురించి చెప్పండి?

జూన్ నుంచి మార్చి వరకు మల్బరీని సాగు చేసుకోవచ్చు. సిబి రకం, బైవోల్ట్ రకం. సిబి రకం వేడి వాతావరణంలో సాగు చేసుకోవచ్చు. బైవోల్ట్ రకం వేసవిలో సాగు చేసుకోవాలి. నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు బైవోల్ట్ సీడ్, మార్చి నుంచి జూన్ వరకు సిబి రకం రకాలను సాగు చేసు కోవాలి.

మల్బరీ దశలను వివరించండి?

నాలుగు జరాలు, ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చేది మొదటి దశ, మూడు రోజుల తర్వాత జరానికి పోవడం జరుగుతుంది. 24 రోజుల్లో పురుగు రూపంలో లార్వా దశ వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది రోజుల తరువాత గూడు కట్టుకోవడాన్ని పీపా దశ అంటారు. ఐదవ రోజు మార్కెట్ పోవడం జరుగు తుంది. ఐదో రోజు మార్కెట్ తీసుకెళ్లి ఇ-యాక్షన్ ద్వారా రీలర్స్‌కు విక్రయించాలి. రేటు ఇష్టం లేకపోతే సెకెండ్, థర్డ్ యాక్షన్స్‌కు వెళ్లొచ్చు. విక్రయ అనంతరం గంట తర్వాత రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

షెడ్ల ఏర్పాటు, సంరక్షణ ఎలా ?

ఊరు బయట, పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేయాలి. 50 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, 35 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు తో షెడ్లు నిర్మించాల్సి ఉంది. యూనిట్ విలువ రూ.4.50 లక్షలు అయితే ఓసి, బిసిలకు 75 శాతం సబ్సిడీ, ఎస్‌సి, ఎస్‌టి 90 శాతం సబ్సిడీ ఇస్తారు. రూ.3.60 లక్షలు వస్తుంది. షెడ్ల అడుగు భాగంలో న్యూస్ పేపర్ పరిచి షూట్ ఫీడింగ్ (కొమ్మలు వేయడం) చేయాలి. నేత్రికలు, చాకీ కట్టెలు ఏర్పాటు చేయాలి. సున్నం కొట్టడంతో క్రిమి కీటకాదులు నశించి పోవడంతో తెగులు అనేది ఉండదు. ఫలితంగా లేబర్ ఛార్జీ తగ్గుతుంది. కొమ్మ అధిక సమయం ఫ్రెష్‌గా ఉంటుంది.

పంట దశలను వివరించండి?

మూడు నెలల పాటు నారు సాగు చేయాల్సి ఉంటుంది. నాలు గున్నర నెలకు కోత దశకు చేరుకుంటుంది. ప్రతి 45 రోజులకోసారి పంట కోతకు వస్తుంది. ఈలెక్కన ఏడాదికి ఐదు నుంచి ఆరు పంటలు తీసే అవకాశం ఉంది. దీంతో ఎకరా సాగుకు 250 నుంచి 300 గుళ్ల మేపవచ్చు. కోతకు రూ.90 వేల చొప్పున ఆరు కోతల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. ఈలెక్కన ఎకరానికి రూ.రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ప్రతి పల్లెకూ త్రీఫేస్ కరెంట్ : ఎఇ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్డిఎస్ఎస్ స్కీంలో భాగంగా ప్రతి పల్లెకు త్రీఫేస్ కరెంటు రాబోతుందని, కొన్ని సబ్‌స్టేషన్ పరిధిలో పనులు జరిగాయని, మరి కొన్ని జరుగుతున్నాయని విద్యుత్ ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి ఉదయం ఏడు నుంచి సాయంత్రం నాలుగు వరకు ఉచిత కరెంటు ఇస్తున్నామని తెలిపారు. స్మార్ట్ మీటర్లు బిగింపు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. తొలుత కమర్షియల్‌గా ఉపయోగించుకునే వారికి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. అదానీ సంస్థ ఈ కాంట్రాక్టు చేస్తున్నారని వివరించారు. కొన్నాళ్లపాటు ఎప్పటిలాగే బిల్లులు వస్తాయని తెలిపారు. తర్వాత చిప్ ద్వారా డబ్బులు కట్టే విధంగా వస్తాయని వివరించారు. పట్టణంలో 12 ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరగకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయించామన్నారు. ఎండాకాలం అధికలోడు సమస్యలు రాకుండా మందుజాగ్రత్త చర్యగా రెండు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. లైన్లను కూడా పునరుద్ధరిస్తున్నామని ఆయన వివరించారు

ఎఇ ప్రియదర్శన్‌రెడ్డి

సిఎం చంద్రబాబును కలిసిన వెంకట్, అతని తల్లిదండ్రులు

వెంకట్‌ను 'ప్రచారకర్త'గా నియమించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పుట్టుకతో వైకల్యంతో జన్మించి తల్లిదండ్రుల కృషి, పట్టుదలతో అత్యంత ప్రతిభావంతుడిగా తయారైన వెంకట్‌ను రాష్ట్ర ప్రభుత్వం 'ప్రచారకర్త'గా నియమించాలని, ప్రతిభకు పట్టం కట్టాలని వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి, రాధాకృష్ణ కోరారు. ఆ మేరకు వారు ముఖ్యమంత్రి చంద్రబాబును తాడేపల్లిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో భవిత కేంద్రాల్లో మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ప్రేరణ, పట్టుదలను పెంపొందించేందుకు దోహదపడ్తారన్నారు. ఇందుకు చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తల్లిదండ్రులు తెలిపారు.

ఆగిన నూతన బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణం

ఆగిన బాలికల పాఠశాల నిర్మాణ పనులు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరులోని నంద్యాల రోడ్డు ఆనకుంటలో రూ.1.44 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు ఏడాది నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. నాలుగు వందల మంది బాలికలు ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక గదులు లేకపోవడంతో బాలుర పాఠశాల ఆవరణలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో విడత కింద 12 గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ప్రారంభంలో పనులు వేగంగా జరిగి.. రెండు అంతస్థులకు సంబంధించి స్లాబ్ కూడా పూర్తి చేశారు. తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అనంతరం ఎన్నికలు రావడం ప్రభుత్వం మార్పుతో ఈ పాఠశాలను గాలికి వదిలేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, విద్యాశాఖ అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో నూతన భవనాల్లోకి బాలికలు మారేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ట్రిపుల్‌ఐటిలో నేడు రక్తదానం

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ఉన్న మల్లెలమ్మ తల్లి 13వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటలకు పలు కార్యక్రమాలతోపాటు ఆలయ ప్రాంగణంలో కడప రిమ్స్, కాలేజీ యాజమాన్యం సహాయ సహకారాలతో రక్తదానం శిబిరం నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. రక్తదానం చేయదలచిన వారు 81064 73271 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సాయంత్రం 5 గంటల నుండి ఆర్కే వ్యాలీ క్యాంపస్ పురవీధుల గుండా అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందన్నారు.

మల్లారెడ్డికి పలువురు నివాళులు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని గాండ్లవీధికి చెందిన టిడిపి నేత వేమిరెడ్డి మల్లారెడ్డి మృతి చెందడంతో ఆయన మృతదేహానికి పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి నివాళులర్పించారు. సీనియర్ టిడిపి నేత వేమిరెడ్డి కృష్ణారెడ్డి తండ్రి మల్లారెడ్డి శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం టిడిపి నేతలు జివి రమణ, పోతిరెడ్డి శివ, కావలి భానులతో కలిసి తులసిరెడ్డి మల్లారెడ్డికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఉత్తన్న, అమర్నాథ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

బిసి కాలనీలో నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బిసి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంత్రి ఆదేశాలు మేరకు టిడిపి గ్రామ నాయకులు డేరంగుల శ్రీనివాసులు సొంత నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆదివారం బోరు వేయించడంతో మూడు ఇంచుల్లో నీరు పడడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తాగునీటి సమస్యను తీసుకుపోయి వెంటనే గ్రామ నాయకులకు బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించి దాహార్తిని తీర్చారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి గాలివీటి సురేంద్రనాథ్‌రెడ్డి, అంజనారెడ్డి, అయోధ్య పురం పట్టాభి రెడ్డి, శివారెడ్డి, ఆర్ఎంపి శ్రీనివాసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పైప్‌లైన్.. తాగునీరు వృథా

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లెలో ప్రధానంగా ఉన్న పైప్‌లైన్ దెబ్బతిని తాగునీరు వృథాగా పోయి నీరు కలుషితమవుతుంది. బిఎస్ఎన్ఎల్ సిబ్బంది యంత్రాలతో చేస్తున్న పనుల్లో ఎంపిడిఒ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న పొలాల్లో ఉన్న పలుసుతోపు నుంచి వస్తున్న మంచి నీటి పైప్ లైన్ దెబ్బతిని నీరు వృథా పోతుండటంతో పలు వీధుల్లో మంచినీటి సమస్య ఏర్పడింది. పైప్‌లైన్‌కు ఒకసారి జాయింట్ వేయాలంటే రూ.30వేలు ఖర్చు అవుతుందని పంచాయతీ అధికారులు తెలిపారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

అల్లాడుపల్లె వద్ద ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పెన్నా నది నుండి తిప్పిరెడ్డిపల్లి, రాజుపాలెం, వెదురూరు గ్రామాల వద్ద నుండి అక్రమంగా వ్యాపారులు ఇసుకను తరలిస్తున్నారు. రెవిన్యూ అధికారులు, పోలీసులు, సచివాలయ సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక సరఫరాలో పలు మార్పులు తీసుకువచ్చింది. ఇందులో భాగంగా గ్రామ సమీపాన వాగులు, వంకలు, నదులు ఉంటే వారి అవసరం మేరకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా ఇసుకను సరఫరా చేసుకోవచ్చు అని ఉత్తర్వులు విడుదల చేసింది. అవసరమైన వారు సంబంధిత సచివాలయంలో పంచాయతీ అధికారుల అనుమతి మేరకు మాత్రమే ఇసుకను తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నిబంధనలు ఏమాత్రం అమలు కావడం లేదు. చాపాడు మండల పరిధిలో కుందూ, పెన్నా నదులు అందుబాటులో ఉన్నాయి. కుందూ నది ఇసుక రాళ్లతో కూడినది కావడంతో గృహ అవసరాలకు దాదాపుగా వినియోగించరు. ఈ ఇసుకను చప్పట, ఫ్లోరింగ్ వంటి కొన్ని అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తారు. పెన్నా నది ఇసుక మాత్రం స్లాబులు, పూతలు, సిమెంట్ రోడ్లు వంటి అన్ని అవసరాలకు అనువుగా ఉంటుంది. ఇదే అదునుగా కొంతమంది ఇసుక వ్యాపారులు పెన్నా పరివాహక గ్రామాలకే కాకుండా ఇతర గ్రామాలకు కూడా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వెదురూరు, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల వద్ద ప్రభుత్వం ఇసుక క్వారీలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిధిలో నూతన క్వారీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదు. చాపాడుకు ట్రాక్టర్ ఇసుకను రూ.3వేలకు, మైదుకూరుకు రూ.3,500, దువ్వూరుకు రూ.4వేలు ధరలు నిర్ణయించి రవాణా సాగిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక రవాణా సాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల మీదుగా నిత్యం ట్రాక్టర్లు ఇసుక లోడుతో వెళుతున్న ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు సచివాలయ సిబ్బందికి ఇసుక సరఫరాలో పలు సూచనలు చేసినప్పటికీ వారు ఏమాత్రం తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో పోలీస్‌లు తరచూ తనిఖీలు చేస్తూ ఇసుక ట్రాక్టర్లను పట్టుకునేవారు. ఈ మధ్యకాలంలో ఇసుక రవాణా తమకు ఎలాంటి సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారు. తహశీల్దార్ ఇతర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన సందర్భంలో మాత్రం ఒకటి రెండు ట్రాక్టర్లను పట్టుకుంటున్నారు. కుచ్చుపాప, పెద్ద గురువలూరు, అల్లాడుపల్లె మీదుగా అధికంగా ఇసుకను తరలిస్తున్నారు. గతంలో కన్నా ఇసుక తక్కువ ధరకు, సులభంగా లభిస్తుండడంతో ఇంటి అవసరాలకు వినియోగిం చుకునే వారు, కాంట్రాక్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించుకునేందుకు వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకించాలని టిఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం వక్ఫ్ సవరణ బిల్లు-2024 తిరస్కారం, స్థానిక సమస్యల గురించి చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ గెజిట్లో చూపబడిన ఆస్తులు అనేకచోట్ల వక్ఫ్ బోర్డు ఆధీనంలో లేవన్నారు. దేశం మొత్తం మీద 70 శాతం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. కొన్నిచోట్ల ప్రభుత్వాలే తమ అవసరాల కోసం వక్ఫ్ ఆస్తులను వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల వక్ఫ్‌కు చెందిన ఐదు ప్రదేశాలలోని ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని వివరించారు. మోడంపల్లె మసీదు, జామియా మసీదు, నజరుల సాహెబ్ ఆస్తి షా హుస్సేన్ వలి సాహెబ్, మహబూబ్ సుభాని దర్గా ఆస్తులు 80 శాతం అన్యాక్రాంతమయ్యాయని వివరించారు. చుట్టుపక్కల గ్రామాలైన తాళ్లమాపురం, కల్లూరు, ఉప్పరపల్లె, పల్లవోలు, చీపాడు, చిన్న గురువలూరు, పెద్ద గురువలూరు, బూడిదపాడు, పొట్టిపాడు, కామనూరు, హనుమన గుత్తి తదితర చోట్ల వందశాతం అన్యాక్రాంతమయ్యాయని వాపోయారు. ఇక పార్నపల్లెలో అయితే వందల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డుకు జ్యుడి షియల్ అధికారాలు లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. వక్ఫ్‌కు సంబంధించిన కేసులు ప్రొద్దుటూరు కోర్టులో 2000 సంవత్సరం నుండి ఇప్పటికీ తేలకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇంకా ఈ సవరణలు తెస్తే వక్ఫ్ బోర్డులు పూర్తిగా నిర్వీర్యమై పోతాయన్నారు. ముస్లింలు ప్రతి చోట వక్ఫ్ పరిరక్షణ కమిటీలుగా ఏర్పడి ఆస్తులను కాపాడాలన్నారు. ఆదాయం సమకూర్చి పేద ముస్లింల విద్య, వైద్యం, సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ఇందుకు తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్ఫాన్‌బాషా, కమల్ సాహెబ్, ఫరీద్, ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుతుబుద్దీన్

ప్రభుత్వ భూమి చదునును అడ్డుకున్న అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లె గ్రామంలో భూములు కబ్జాకు గురవుతున్నాయి. వేంపల్లె గ్రామంలోని పాములూరు రహదారిలోని గుట్ట సమీపంలో ఆదివారం డికెటికి చెందిన 10 ఎకరాల స్థలాన్ని టిడిపి నేత చదును చేశారు. జెసిబి, ట్రాక్టర్లుతో ప్రభుత్వ భూమిని చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. స్పందించిన తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది డికెటి భూమిని చదును చేస్తున్న జెసిబి, ట్రాక్టర్లును వెనక్కి పంపారు. భూమిని చదును చేస్తున్న టిడిపి నేత మాట్లాడుతూ.. తాను 40ఏళ్లుగా ఈ స్థలంలో పంటలను సాగు చేస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ హెచ్చరించారు. టిడిపి నేతకు పాములూరు రహదారిలో ఉన్న భూమికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా చేద్దాం అన్న ధోరణితో ఎక్కడ చూసినా చదును చేసి ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ భవనాలు.. పరాధీనం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రజాధనంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పలుచోట్ల నిరుపయోగంగా మారడంతోపాటు అన్యాక్రాంతానికి గురయ్యాయి. ప్రభుత్వ ఆస్తుల రక్షణ అధికారులపై ఉన్నా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ప్రజలు నుంచి పెద్ద ఎత్తున వ్యక్తం అవుతున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామాలలో ప్రాథ మిక, ప్రాథమిక ఉన్నత పాఠశాల భవనాలు చాలావరకు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రయివేట్ పాఠశాలలపై ఆసక్తి తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఉండడంతోపాటు, విద్యార్థులు లేరన్న కారణంతో ప్రభుత్వ పాఠశాలలు పెద్ద ఎత్తున మూతపడ్డాయి. ఇలాంటి భవనాలను గ్రామాల్లో కొందరు పెద్దలు, రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు సొంత అవసరాలకు విని యోగించుకుంటూ తమ ఆధీనంలోకి తెచ్చుకుంటున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని పత్తూరు సమీపంలోని బెస్త కాలనీలో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన విలువైన భవనాలు నిరుప యోగంగా ఉన్నాయి. ఈ భవనాలు కడప ప్రధాన రహదారికి సమీపంలో దగ్గరలో ఉన్నాయి. ఈ భవనాలు రూ.లక్షలు విలువ చేస్తాయి. ఇంతటి విలువైన భవనాలను పరిరక్షించాల్సిన అధికారులు వాటిని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రయివేట్ వ్యక్తులు కొందరు ఈ భవనాలను సొంత అవసరాలకు వినియోగిం చుకుం టున్నారు. ఈ విషయం స్థానిక నాయకులకు, సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భవనాలు చాలా వరకు వృథాగానే ఉన్నాయి. రైతులు ధాన్యం నిలువ చేసుకోవడం కోసం అందు బాటులో గోదాములు లేక ధాన్యాన్ని నిల్వ ఉంచు కునే పరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. సువిశాలమైన ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నా ఉపయోగించుకోలేని పరిస్థితి. ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి నిరుప యోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి ప్రజా అవసరాల కోసం అందుబాటులోకి తీసుకు రావాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అన్యాక్రాంతానికి గురైన భవ నాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాల్సి ఉందని పేర్కొంటున్నారు.

ప్రయివేట్ వ్యక్తులు ఉపయోగంలో ఉన్న బెస్త కాలనీ సాంఘిక సంక్షేమ శాఖ భవనం

రోడ్డు పొడవునా గుంతలు..తప్పని అవస్థలు

అధ్వానంగా ఉన్న ఉప్పలూరు రోడ్డు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఉప్పలూరు నుంచి చిలమకూరు వెళ్లే దారి రోడ్డు పొడవునా గతుకులు, గుంతలతో ఉంది. ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఉప్పలూరు, కోనాపురం, మాదన్నగారిపల్లె, కర్సుకుంటపల్లె మీదుగా ఎర్రగుంట్ల మండలం చిలమకూరుకు వెళ్లేందుకు 10కిలోమీటర్లు ఉంది. ఈ రోడ్డులో ప్రొద్దుటూరు నుంచి బస్సులు, లారీలు, మినీ వ్యాన్లు తిరుగుతుంటాయి. ఉప్పలూరు చుట్టుపక్క గ్రామాలు ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. ఈ గ్రామాల ప్రజలు, వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తూంటారు. గుంతల రోడ్డులో ప్రయాణించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి దారి కనపడక కింద పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా అధికారులు రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

ఉప్పలూరు మీదుగా చిలమకూరు, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు నిత్యం తిరుగుతుంటారు. రోడ్డు పొడవునా గుంతలు, గతుకులతో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం చేస్తే ప్రమాదవశాత్తూ గుంతలో పడితే పెద్ద ప్రమాదమే జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలి.

- పల్లా గంగయ్య సర్పంచ్, ఉప్పలూరు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక శిల్పారామంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మాస్టర్ రాజా, శ్రీ రాజా కళానిలయం, పులివెందుల వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో చిన్నారులను ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ రాజా, పరిపాలనా అధికారి సుధాకర్, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారులు

మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మట్టిముంత ఇచ్చి వారి నుండి వెండి చెంబు దొంగిలించినట్లుందని కూటమి పాలన అని విమర్శించారు. చంద్రబాబు పాలన ఇచ్చేది గోరంత.. లాక్కునేది కొండంత అన్నట్లు ఉందన్నారు. ఉచిత గ్యాస్ పథకం కింద ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్నది ఏడాదికి రూ.2,694కోట్లు కాగా, కరెంటు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజల నుంచి లాక్కుంటున్నది అక్షరాల రూ.15,485 కోట్లు అన్నారు. ఉచిత గ్యాస్ పథకం కూడా పాక్షికంగానే అమలవుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలలో చాలావరకు అమలు కావడం లేదన్నారు. నిరుద్యోగ భృతి అతీగతి లేదన్నారు. మహిళలకు, మగవాళ్లకు, ఆఖరుకు హిజ్రాలకు కూడా రక్షణ కరువైందన్నారు. రాష్ట్ర ప్రగతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తులసిరెడ్డి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూల నజీర్ అహ్మద్, సీనియర్ నాయకులు బ్రహ్మానంద రెడ్డి, జిల్లాని బాషా, రషీద్, ఖాజా, అలీ షాహిద్, అమర్, ఉత్తన్న, ఐచర్ రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లికి వందనం నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్ అంటూ కూటమి ప్రభుత్వ తీరును విమర్శించారు. కూటమి ప్రభుత్వం పెట్టిన సూపర్ 6 పథకాలు అట్టర్‌ప్లాప్ అయ్యాయన్నారు. మండలానికి 4 మద్యం షాపులు, 40 బెల్టు షాపులు అన్నవిధంగా మద్యం పాలసీ తయారైందన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తూనే ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పాలన సాగించాలని ఆయన కోరారు.

కురబల అభ్యున్నతికి డైరెక్టర్లు కృషి చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబల అభ్యున్నతికి డైరెక్టర్లు కృషి చేయాలని కురబ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లెరెడ్డి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎపి కురబ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఉమ్మడి చిత్తూరు జిల్లాల నుంచి వల్లిగట్ల వెంకటరమణ, రాజగోపాల్, ఉయ్యాల రమణ, సుబ్ర హ్మణ్యం గౌడలు ఎంపిక కావడం శుభపరిణామమని బెల్లెరెడ్డి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. నూతన డైరెక్టర్లను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కురబల ప్రాబల్యాన్ని గుర్తించి సిఎం చంద్రబాబు నాయుడు కురవ కార్పొరేషన్‌లో నలుగురికి డైరెక్టర్లుగా చోటుకల్పించడం జరిగిందన్నారు. కురబలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశమేనని స్పష్టం చేశారు. నూతన డైరెక్టర్లు కురబల సంక్షేమానికి కృషి చేయాలని, కార్పొరేషన్ ద్వారా అర్హులైన కురువలకు విరివిగా రుణాలు అందేలా చూడాలని ఆకాంక్షించారు. కురబలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న టిడిపికి మనమంతా రుణపడి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కురబ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

135 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- కలకడ

135 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టి వేసిన సంఘటన కలకడ, సంబేపల్లి మండల సరిహద్దుల్లో జరిగింది. కలకడ మండలం సమీపంలోని సంబేపల్లి మండలం సోత్రం సోమవారం గ్రామం దేవలంపేట సమీపంలో ఉన్న రెండు చోట్ల సుమారు 135 క్వింటాళ్ల రేషన్ బియ్యం దాచి ఉంచిన విషయాన్ని తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తన సిబ్బందితో వచ్చి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడులలో మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లికి చెందిన కెసి నాగరాజ్‌కు చెందిన షెడ్డును అదే గ్రామానికి చెందిన జోహార్‌కు అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. జోహార్ సుమారు 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దాచి ఉంచినట్లు పేర్కొన్నారు. అదే గ్రామానికి చెందిన మల్లికార్జున భార్య బసమ్మకు చెందిన వేరుశనగ మిషన్‌లో ఎర్రయ్యగారిపల్లికు చెందిన బాలాజీ అనే వ్యక్తి సుమారు 55 క్వింటాళ్ల రేషన్ బియ్యం దాచి ఉంచడం గుర్తించి నట్లు తెలిపారు. రెండు ప్రాంతాల్లో ఉన్న 135 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని జెసి సంబంధిత అధికారులను ఆదేశించడం తెలిపారు. జిల్లాలో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇలాంటి చర్యలకు పాల్గొన్న వారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లాలో మరో వారం రోజులపాటు పర్యటించి రేషన్ బియ్యం ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు. డిఎస్ఒ రఘురాం, తహశీల్దార్ ఫణికుమార్, సిఐ గురునాథ, సంబేపల్లి ఎస్ఐ భక్తవత్సలం, పోలీసులు రమణ నాయక్, ముత్యాలు, విఆర్ఒలు, విఆర్ఒలు, రెవెన్యూ, గోడౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సభ్యులకు చిరుధాన్యాలు పంపిణీ

తంబళ్లపల్లి : రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల మొగ్గుచూపి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రకృతి వ్యవసాయాన్ని అమలు పరచుకోవాలని ఎపిసిఎన్ఎస్ జూనియర్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ పవన్, ఎన్ఎఫ్ఎ సునీత సూచించారు. ఎర్ర సానిపల్లెలో ఆర్‌వైఎస్ఎస్, ఎపి సిఎంఎఫ ఆధ్వర్యంలో భాగంగా ఆరోగ్య పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిం చిన చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఫుట్ బాస్కెట్‌ను గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు, 72 నిరుపేద మహిళల సంఘ సభ్యుల కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబం రసాయన రహిత ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని సూచించారు.

విపత్తులను ఎదుర్కొనేలా ఎదగాలి

రాయచోటి : జిల్లాలోని స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్‌లకు నిర్వహించిన బేసిక్, అడ్వా న్సుడ్ శిక్షణా కార్యక్రమం విజయవం తంగా ముగిసినట్లు స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలి పారు. ఆదివారం గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాలలో ఈనెల 2 నుంచి 8 వరకు ఏడు రోజులపాటు నిర్వ హించిన ఈ శిక్షణ కార్యక్ర మంలో బేసిక్ శిక్షణకు 100 మంది, అడ్వాన్సుడ్ శిక్షణకు పది మంది స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు హాజర య్యారన్నారు. ఈ శిక్షణలో రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొని పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి అంశాలలో ఏ విధంగా శిక్షణ ఇవ్వాలి, నైతిక విలువలు, మానవతా విలువలు, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సేవా భావం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 793/2023

గుర్రం ఆనంద రావు .. వాది

వర్సస్

కిన్నెర బాబురావు .. ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

కిన్నెర బాబు రావు తండ్రి కిన్నెర లాజర్, హిందూ,వయసు 35 సంవత్సరాలు, ఆర్మీ, నివాసం : డోర్ నెం 2-13, రెడ్డి పల్లి గ్రామం, కలసపాడు మండలం, కడప జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ : 11-12-2024న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షమందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు

తేదీ : 08-12-2024

ఇట్లు

శ్రీ డి.సిద్దయ్య,
వాది తరుపు అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం: 8897214930